27-02-2024 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - సదా తండ్రి స్మృతి యొక్క చింతనను మరియు జ్ఞానము యొక్క విచార సాగర మంథనమును చేసినట్లయితే కొత్త-కొత్త పాయింట్లు వెలువడుతూ ఉంటాయి, సంతోషములో ఉంటారు"

ప్రశ్న:- ఈ డ్రామాలో అందరికన్నా అత్యంత గొప్ప అద్భుతము ఎవరిది మరియు ఎందుకు?

జవాబు:- 1- అందరికన్నా గొప్ప అద్భుతము శివబాబాది ఎందుకంటే వారు మిమ్మల్ని క్షణములో దేవకన్యలుగా చేస్తారు. వారు ఎటువంటి చదువును చదివిస్తారంటే, దాని ద్వారా మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు. ప్రపంచంలో ఇటువంటి చదువును తండ్రి తప్ప ఇంకెవ్వరూ చదివించలేరు. 2- జ్ఞానమనే మూడవ నేత్రాన్ని ఇచ్చి అంధకారము నుండి ప్రకాశములోకి తీసుకురావడము, ఎదురుదెబ్బలు తినడం నుండి రక్షించడము, ఇది తండ్రి పని, అందుకే వారి వంటి అద్భుతమైన కార్యాన్ని ఇంకెవ్వరూ చేయలేరు.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి ప్రతిరోజూ పిల్లలకు అర్థం చేయిస్తారు మరియు పిల్లలు స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రి నుండి వింటారు. ఏ విధముగా తండ్రి గుప్తమో అలాగే జ్ఞానం కూడా గుప్తమైనది. ఆత్మ అంటే ఏమిటో, పరమపిత పరమాత్మ అంటే ఏమిటో ఎవ్వరికీ అర్థం కాదు. నేను ఒక ఆత్మను అని పిల్లలైన మీకు పక్కాగా అలవాటైపోవాలి. తండ్రి ఆత్మలైన మనకు వినిపిస్తారు. దీనిని బుద్ధి ద్వారా అర్థం చేసుకుని కర్మలోకి రావాలి. ఇకపోతే వ్యాపార, వ్యవహారాలనైతే చేయవలసిందే. ఎవరైనా పిలిస్తే తప్పకుండా పేరుతోనే పిలుస్తారు. నామ-రూపాలు ఉన్నాయి కావుననే మాట్లాడగలుగుతారు. ఏమైనా చేయగలుగుతారు. కేవలం నేను ఒక ఆత్మను అన్నది పక్కా చేసుకోవాలి. మహిమ అంతా ఆ నిరాకారునిదే. సాకారములో దేవతల మహిమ ఉన్నా కానీ వారిని కూడా మహిమాయోగ్యులుగా తండ్రే తయారుచేసారు. ఒకప్పుడు మహిమాయోగ్యులుగా ఉండేవారు, ఇప్పుడు తండ్రి మళ్ళీ మహిమాయోగ్యులుగా తయారుచేస్తున్నారు, కావుననే ఆ నిరాకారునికే మహిమ ఉంది. తండ్రికి ఎంత మహిమ ఉంది మరియు వారి సేవ ఎంత ఉంది అని ఆలోచించడం జరుగుతుంది. వారు సమర్థుడు, వారు అన్నీ చేయగలరు. మనం వారిని చాలా కొద్దిగానే మహిమ చేస్తాము. మహిమైతే వారిది ఎంతో ఉంది. ముసల్మాన్లు కూడా అల్లామియా (అరబిక్ భాషలో భగవంతుని పేరు) ఇలా ఆజ్ఞాపించారు అని అంటారు. ఇప్పుడు వారు ఎవరి ఎదురుగా ఆజ్ఞాపించారు? మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యే పిల్లల ఎదురుగానే ఆజ్ఞాపిస్తారు. అల్లామియా తప్పకుండా ఎవరినో అయితే ఆజ్ఞాపించారు కదా. పిల్లలైన మీకే అర్థం చేయిస్తారు, దీని గురించి ఇంకెవ్వరికీ తెలియదు. ఇప్పుడు మీకు తెలిసింది, తర్వాత ఈ జ్ఞానమంతా మాయమైపోతుంది. బౌద్ధులు కూడా ఇలాగే అంటారు, క్రిస్టియన్లు కూడా ఇలాగే అంటారు. కానీ ఏమని ఆజ్ఞాపించారు అన్నది ఎవరికీ తెలియదు. తండ్రి పిల్లలైన మీకు అల్ఫ్ (భగవంతుడు) మరియు బే (రాజ్యాధికారము) గురించి అర్థం చేయిస్తారు. ఆత్మ తండ్రి స్మృతిని మర్చిపోలేదు. ఆత్మ అవినాశీ కావున స్మృతి కూడా అవినాశీగా ఉంటుంది. తండ్రి కూడా అవినాశీయే. అల్లామియా ఇలా అన్నారు అని అంటారు కానీ వారు ఎవరు, ఏమన్నారు - ఇది ఏమీ తెలియదు. అల్లామియాను రాయి, రప్పల్లో ఉన్నారని అనేసారు, మరి అలాంటప్పుడు వారిని ఏం తెలుసుకోగలరు. భక్తి మార్గంలో ప్రార్థనలు చేస్తారు. ఎవరెవరైతే వస్తారో వారందరూ సతో, రజో, తమోలలోకి రావలసిందేనని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. క్రైస్టు, బుద్ధుడు మొదలైనవారు ఎవరైతే వస్తారో వారి వెనుక అందరూ దిగవలసిందే. పైకి ఎక్కే విషయమే లేదు. తండ్రే వచ్చి అందరినీ పైకి తీసుకువెళ్తారు. సర్వుల సద్గతిదాత ఒక్కరే. ఇంకెవ్వరూ సద్గతిని ఇవ్వడానికి రారు. క్రైస్టు వచ్చారని భావించినట్లయితే వారు ఎవరికి కూర్చొని అర్థం చేయిస్తారు? ఈ విషయాలను అర్థం చేసుకునేందుకు మంచి బుద్ధి కావాలి. కొత్త-కొత్త యుక్తులను కనుగొనాలి, కష్టపడాలి, రత్నాలను వెలికి తీయాలి, అందుకే బాబా అంటారు, విచార సాగర మంథనము చేసి వ్రాయండి, ఆ తర్వాత ఏమేమి మిస్ అయ్యాయో చదివి చూడండి. తండ్రి పాత్ర ఏదైతే ఉందో అది నడుస్తూ ఉంటుంది. తండ్రి కల్పపూర్వము యొక్క జ్ఞానాన్ని వినిపిస్తారు. ఎవరైతే ధర్మ స్థాపన చేయడానికి వస్తారో వారి వెనుక వారి ధర్మం వారు కూడా కిందకు దిగాలని పిల్లలకు తెలుసు. అటువంటివారు ఎవరినైనా పైకి ఎలా తీసుకువెళ్తారు? మెట్లు కిందకు దిగవలసిందే. మొదట సుఖము, ఆ తర్వాత దుఃఖము. ఈ నాటకము చాలా ఫైన్ గా తయారుచేయబడి ఉంది. విచార సాగర మంథనము చేయవలసిన అవసరం ఉంది. ధర్మపితలు ఎవరి సద్గతిని చేసేందుకు రారు, వారు కేవలం ధర్మ స్థాపనను చేయడానికి వస్తారు. జ్ఞానసాగరుడు ఒక్కరే, ఇంకెవరిలోనూ జ్ఞానం లేదు. డ్రామాలో సుఖ, దుఃఖాల ఆట అయితే అందరి కొరకూ ఉంది. దుఃఖము కన్నా సుఖము ఎక్కువగా ఉంది. డ్రామాలో పాత్రను అభినయిస్తున్నారంటే తప్పకుండా సుఖము

ఉండాలి. తండ్రి దుఃఖమునేమైనా స్థాపిస్తారా. తండ్రి అయితే అందరికీ సుఖాన్ని ఇస్తారు. విశ్వములో శాంతి ఏర్పడుతుంది. దుఃఖధామములో శాంతి ఉండదు. ఎప్పుడైతే తిరిగి శాంతిధామానికి వెళ్తారో అప్పుడే శాంతి లభిస్తుంది.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. మేము బాబాతో పాటు ఉన్నామని, బాబా అసురుల నుండి దేవతలుగా తయారుచేయడానికి వచ్చారని ఎప్పుడూ మర్చిపోకూడదు. ఈ దేవతలు సద్గతిలో ఉన్నప్పుడు మిగిలిన ఆత్మలందరూ మూలవతనములో ఉంటారు. డ్రామాలో అందరికన్నా పెద్ద అద్భుతము అనంతమైన తండ్రిది, వారు మిమ్మల్ని దేవకన్యలుగా తయారుచేస్తారు. చదువు ద్వారా మీరు దేవకన్యలుగా అవుతారు. భక్తి మార్గములో ఏమీ అర్థం చేసుకోరు, మాలను తిప్పుతూ ఉంటారు. ఒకరు హనుమంతుడిని, ఒకరు ఇంకెవరినో తలచుకుంటారు, వారిని తలచుకోవడం వల్ల లాభమేముంది? తండ్రి 'మహారథి' అని అన్నారు, దానికి వారు ఏనుగుపై స్వారీ చేసినట్లుగా చూపించారు. ఈ విషయాలన్నింటినీ తండ్రే అర్థం చేయిస్తారు. గొప్ప-గొప్ప వ్యక్తులు ఎక్కడికైనా వెళ్ళినప్పుడు వారికి ఎన్నో స్వాగత సత్కారాలు చేస్తారు. మీరు ఇంకెవ్వరికీ సత్కారాలు చేయరు. ఈ సమయంలో వృక్షమంతా శిథిలావస్థలో ఉందని మీకు తెలుసు. ఇక్కడ విషముతో జన్మ తీసుకుంటారు. సత్యయుగములో విషము యొక్క విషయమే ఉండదని ఇప్పుడు మీకు ఫీలింగ్ రావాలి. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని పదమాపదమపతులుగా తయారుచేస్తాను. సుధాముడు పదమాపదమపతిగా అయ్యారు కదా. అందరూ తమ కోరికే చేసుకుంటారు. తండ్రి అంటారు, ఈ చదువు ద్వారా మీరు ఎంత ఉన్నతముగా తయారవుతారు. ఆ గీతను అందరూ వింటారు, చదువుతారు. ఇతను కూడా చదివేవారు కానీ, ఎప్పుడైతే తండ్రి కూర్చొని వినిపించారో అప్పుడు ఆశ్చర్యపోయారు. తండ్రి ద్వారా లభించిన గీతతో సద్గతి లభించింది. ఈ మనుష్యులు కూర్చొని ఏమేమో తయారుచేసారు. అల్లామియా ఇలా అన్నారు అని అంటారు, కానీ అసలు ఆ అల్లా ఎవరు? అన్నది ఏమీ అర్థం చేసుకోరు. దేవీ-దేవతా ధర్మము వారికే భగవంతుని గురించి తెలియనప్పుడు ఇక ఎవరైతే వెనుక వస్తారో వారేమి తెలుసుకోగలరు. సర్వశాస్త్రమయి శిరోమణి అయిన గీతనే తప్పుగా చేసేసారు, మరి మిగిలిన శాస్త్రాలలో ఇంకేముంటుంది? తండ్రి పిల్లలైన మనకు ఏదైతే వినిపించారో అది కనుమరుగైపోయింది. ఇప్పుడు మీరు తండ్రి నుండి విని దేవతలుగా అవుతున్నారు. పాత ప్రపంచము యొక్క లెక్కాచారాలనైతే అందరూ తీర్చుకోవలసిందే. ఆ తర్వాత ఆత్మ పవిత్రముగా అయిపోతుంది. వారికి కూడా ఏవైనా లెక్కచారాలు మిగిలి ఉంటే అవి తీరిపోతాయి. మనమే మొట్టమొదట వెళ్తాము, మళ్ళీ మొట్టమొదట వస్తాము. మిగిలినవారంతా శిక్షలు అనుభవించి లెక్కాచారాలను తీర్చుకుంటారు. ఈ విషయాలలోకి ఎక్కువగా వెళ్ళకండి. మొట్టమొదట సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రేనని నిశ్చయం చేయించండి. ఆ తండ్రి ఒక్కరే శిక్షకుడు మరియు గురువు కూడా. వారు అశరీరి. ఆ ఆత్మలో ఎంతటి జ్ఞానం ఉంది. వారు జ్ఞానసాగరుడు, సుఖసాగరుడు. వారికి ఎంత మహిమ ఉంది. వారు కూడా ఒక ఆత్మయే. ఆత్మయే వచ్చి శరీరములోకి ప్రవేశిస్తుంది. పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ ఆత్మ మహిమను చేయలేరు. మిగిలినవారంతా శరీరధారుల మహిమను చేస్తారు. వీరు సుప్రీమ్ ఆత్మ. శరీరము లేకుండా ఆత్మ యొక్క మహిమ అనేది ఒక్క నిరాకారుడైన తండ్రికి తప్ప ఇంకెవ్వరికీ జరుగదు. ఆత్మలోనే జ్ఞానము యొక్క సంస్కారాలు ఉన్నాయి. తండ్రిలో జ్ఞానము యొక్క సంస్కారాలు ఎన్ని ఉన్నాయి. ప్రేమసాగరుడు, జ్ఞానసాగరుడు... ఇది ఆత్మ మహిమనా? మానవమాత్రులెవ్వరికీ ఈ మహిమ ఉండదు. శ్రీకృష్ణుడు సత్యయుగ మొదటి రాకుమారుడు. తండ్రియే వచ్చి పిల్లలకు వారసత్వాన్ని ఇస్తారు, అందుకే వారి మహిమ గానం చేయబడుతుంది. శివజయంతి వజ్రతుల్యమైనది. ధర్మ స్థాపకులు వస్తారు, వచ్చి ఏమి చేస్తారు? క్రైస్టు వచ్చినప్పుడు ఆ సమయంలో క్రిస్టియన్లు లేరు కదా. మరి వారు ఎవరికైనా ఏ జ్ఞానాన్ని ఇస్తారు? మహా అయితే మంచి నడవడికను నడుచుకోండి అని చెప్తారు. ఈ మాటనైతే ఎంతోమంది మనుష్యులు అర్థం చేయిస్తూ ఉంటారు. ఇకపోతే సద్గతి జ్ఞానాన్ని ఎవ్వరూ ఇవ్వలేరు. వారికి తమ-తమ పాత్ర లభించి ఉంది. సతో, రజో, తమోలలోకి రావలసిందే. వచ్చీ రాగానే క్రిస్టియన్ల చర్చిలు ఎలా తయారవుతాయి? ఎప్పుడైతే చాలామంది అవుతారో, భక్తి ప్రారంభమవుతుందో అప్పుడు చర్చిలను నిర్మిస్తారు. దానికి ఎంతో ధనం కావాలి. యుద్ధాలకు కూడా ధనం కావాలి. ఇది మనుష్య సృష్టి రూపీ వృక్షము అని తండ్రి అర్థం చేయిస్తారు. వృక్షము ఎప్పుడైనా లక్షల సంవత్సరాలది ఉంటుందా. అలాగైతే లెక్క కుదరదు. తండ్రి అంటారు - ఓ పిల్లలూ, మీరు ఎంత వివేకహీనులుగా అయిపోయారు, ఇప్పుడు మీరు వివేకవంతులుగా అవుతారు. మీరు రాజ్యం చేయడానికి మొదటే తయారై వస్తారు. వారైతే ఒంటరిగా వస్తారు, ఆ తర్వాత వృద్ధి జరుగుతుంది. వృక్షము యొక్క పునాది దేవీ-దేవతలు, వారి నుండి మళ్ళీ మూడు శాఖలు వెలువడుతాయి. ఆ తర్వాత చిన్న-చిన్న మఠాలు, ఆశ్రమాలు వస్తాయి, వృద్ధి జరుగుతుంది, ఆ తర్వాత వారి మహిమ కొంత జరుగుతుంది. కానీ దాని వల్ల లాభమేమీ లేదు. అందరూ కిందకు రావలసిందే. మీకు ఇప్పుడు మొత్తం జ్ఞానమంతా లభిస్తోంది. గాడ్ ఈజ్ నాలెడ్జ్ ఫుల్ అని అంటారు కానీ ఆ నాలెడ్జ్ ఏమిటి అనేది ఎవరికీ తెలియదు. మీకు ఇప్పుడు ఆ నాలెడ్జ్ లభిస్తోంది. భాగ్యశాలీ రథమైతే

తప్పకుండా కావాలి. తండ్రి సాధారణ తనువులోకి వస్తారు, అప్పుడు మీరు భాగ్యశాలిగా అవుతారు. సత్యయుగములో అందరూ పదమాపదమ భాగ్యశాలురు. ఇప్పుడు మీకు జ్ఞానమనే మూడవ నేత్రము లభిస్తుంది, దాని ద్వారా మీరు లక్ష్మీ-నారాయణుల వలె అవుతారు. జ్ఞానమైతే ఒకసారే లభిస్తుంది. భక్తిలోనైతే ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. అంధకారముంటుంది. జ్ఞానము పగలు, పగలులో ఎదురుదెబ్బలు తినరు. తండ్రి అంటారు, ఇంట్లో గీతా పాఠశాలను తెరిస్తే తెరవండి. ఎంతోమంది - మేమైతే జ్ఞానాన్ని తీసుకోము కానీ ఇతరుల కొరకు స్థలము ఇస్తాము అని అంటారు, అదీ మంచిదే.

ఇక్కడ ఎంతో సైలెన్స్ ఉండాలి. ఇది పవిత్రాతి పవిత్రమైన క్లాస్. ఇక్కడ మీరు శాంతిలో తండ్రిని స్మృతి చేస్తారు. ఇప్పుడు మనం శాంతిధామానికి వెళ్ళాలి, అందుకే తండ్రిని ఎంతో ప్రేమగా స్మృతి చేయాలి. సత్యయుగములో 21 జన్మల కొరకు మీరు సుఖ-శాంతులు రెండింటినీ పొందుతారు. అనంతమైన తండ్రి అనంతమైన వారసత్వాన్ని ఇస్తారు. కావున ఇటువంటి తండ్రిని ఫాలో చేయాలి. అహంకారం రాకూడదు, అది పడేస్తుంది. చాలా ఓర్పుతో కూడిన అవస్థ ఉండాలి. హఠము ఉండకూడదు. దేహాభిమానమును హఠము అని అంటారు. చాలా మధురముగా అవ్వాలి. దేవతలు ఎంత మధురమైనవారు, వారిలో ఎంత ఆకర్షణ ఉంటుంది. తండ్రి మిమ్మల్ని ఈ విధముగా తయారుచేస్తారు. కావున ఇటువంటి తండ్రిని ఎంతగా స్మృతి చేయాలి. పిల్లలు ఈ విషయాలను పదే-పదే గుర్తు చేసుకుంటూ హర్షితమవ్వాలి. మేము శరీరాన్ని వదిలి ఈ లక్ష్మీ-నారాయణుల వలె అవుతాము అని వీరికి నిశ్చయము ఉంది. లక్ష్యము, ఉద్దేశ్యము యొక్క ఈ చిత్రాన్ని మొట్టమొదట చూడాలి. అక్కడ చదివించేవారు దేహధారీ టీచర్లు. ఇక్కడ చదివించేవారు నిరాకారుడైన తండ్రి, వీరు ఆత్మలను చదివిస్తారు. ఇది చింతన చేయడంతోనే సంతోషము కలుగుతుంది. బ్రహ్మ నుండి విష్ణువుగా మరియు విష్ణువు నుండి బ్రహ్మగా ఎలా అవుతారు? అన్న విషయములో ఇతనికి నషా ఉంటుంది. ఈ అద్భుతమైన విషయాలను మీరే విని, ధారణ చేస్తారు, మళ్ళీ వినిపిస్తారు. తండ్రి అయితే అందరినీ విశ్వాధిపతులుగా తయారుచేస్తారు. ఇకపోతే రాజ్యం కొరకు యోగ్యులుగా ఎవరెవరు అవుతారు అనేది అర్థం చేసుకోవచ్చు. పిల్లలను పైకి తీసుకురావడం తండ్రి కర్తవ్యము. తండ్రి అందరినీ విశ్వాధిపతులుగా తయారుచేస్తారు. తండ్రి అంటారు - నేను విశ్వాధిపతిగా అవ్వను. తండ్రి కూర్చుని ఈ నోటి ద్వారా జ్ఞానాన్ని వినిపిస్తారు. ఆకాశవాణి అని అంటారు కానీ అర్థం తెలుసుకోరు. సత్యమైన ఆకాశవాణి అయితే ఇదే, తండ్రి పై నుండి వచ్చి ఈ గోముఖము ద్వారా వినిపిస్తారు. ఈ నోటి ద్వారా వాణి వెలువడుతుంది.

పిల్లలు ఎంతో మధురముగా ఉంటారు. బాబా, ఈ రోజు టోలీ తినిపించండి అని అంటారు. చాలా టోలీ ఇస్తాను పిల్లలూ. మంచి పిల్లలు అంటారు - మేము పిల్లలము కూడా, అలాగే మేము సేవకులము కూడా. పిల్లలను చూసి బాబాకు ఎంతో సంతోషము కలుగుతుంది. సమయం చాలా కొద్దిగానే ఉందని పిల్లలకు తెలుసు. ఇన్ని బాంబులు మొదలైనవేవైతే తయారుచేసారో వాటిని ఊరికే అలా పడేస్తారా? కల్పపూర్వము ఏదైతే జరిగిందో అదే మళ్ళీ జరుగుతుంది. విశ్వములో శాంతి ఏర్పడాలి అని భావిస్తారు. కానీ అలా జరుగదు. విశ్వములో శాంతిని మీరు స్థాపిస్తారు. మీకే విశ్వరాజ్యాధికారము యొక్క ప్రైజ్ లభిస్తుంది. అది ఇచ్చేవారు తండ్రి. యోగబలముతో మీరు విశ్వ రాజ్యాధికారాన్ని తీసుకుంటారు. శారీరిక బలముతో విశ్వము యొక్క వినాశనము జరుగుతుంది. సైలెన్స్ తో మీరు విజయము పొందుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తమ అవస్థను చాలా ఓర్పుతో కూడినదిగా తయారుచేసుకోవాలి. తండ్రిని ఫాలో చేయాలి. ఏ విషయములోనూ అహంకారాన్ని చూపించకూడదు. దేవతల వలె మధురముగా తయారవ్వాలి.

2. సదా హర్షితంగా ఉండేందుకు జ్ఞానాన్ని స్మరిస్తూ ఉండండి. విచార సాగర మంథనము చేయండి. మేము భగవంతుని పిల్లలము కూడా, అలాగే వారి సేవకులము కూడా - ఈ స్మృతితో సేవలో తత్పరులై ఉండండి.

వరదానము:- మన్మనాభవతో పాటు మధ్యాజీభవ యొక్క మంత్ర స్వరూపములో స్థితులై ఉండే మహాన్ ఆత్మా భవ

పిల్లలైన మీకు మన్మనాభవతో పాటు మధ్యాజీభవ అన్న వరదానము కూడా ఉంది. స్వర్గములోని మీ స్వరూపము స్మృతిలో ఉండాలి, దీనిని మధ్యాజీభవ అని అంటారు. ఎవరైతే తమ శ్రేష్ఠ ప్రాప్తుల నషాలో

ఉంటారో, వారే మధ్యాజీభవ యొక్క మంత్ర స్వరూపములో స్థితులై ఉండగలరు. ఎవరైతే మధ్యాజీభవగా ఉంటారో, వారు మన్మనాభవగా ఉండనే ఉంటారు. ఇటువంటి పిల్లల ప్రతి సంకల్పము, ప్రతి మాట మరియు ప్రతి కర్మ మహాన్ గా అవుతాయి. స్మృతి స్వరూపులుగా అవ్వటము అనగా మహాన్ ఆత్మలుగా అవ్వటము.

స్లోగన్:- సంతోషము మీ స్పెషల్ ఖజానా, ఈ ఖజానాను ఎప్పుడూ విడిచిపెట్టకండి.